సాక్షి కర్నూలు

మంగళవారం | 10 | సెప్టెంబర్ | 2024



అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

గురురాఘవేంద్ర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో పంప్ సెట్ల ధ్వంసం కేసును పోలీసులు ఛేదించారు. ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. 8లో▸



విభూతి ధారణ పునఃప్రారంభం

శ్రీశైలంటెంపుల్: కోవిడ్ సమయంలో నిలిచిపోయిన విభూతి ధారణను సోమవారం శ్రీశైల దేవస్థాన ఈఓ పెద్దిరాజు పునఃప్రారంభించారు. నుదుట బొట్టు పెట్టుకోవడం సంప్రదాయమన్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,632
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 34,972
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	: 34,732

న్యూస్‌రీల్

తొమ్మిది రోజుల్లో 52 మి.మీ. వర్షపాతం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 13 మండలాల్లో వానలు పడ్డాయి. మంత్రాలయంలో 10.2 మి.మీ, కోసిగిలో 9.4 మి.మీ మేర వర్షం కురిసింది. కౌతాళం, కర్నూలు రూరల్, కల్లూరు, గూడూరు, కర్నూలు అర్బన్, నందవరం, సి.బెళగల్, ఆదోని, కోడుమూరుల్లో కూడా తేలికపాటి వర్షాలు కురిశాయి. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ ఉండగా.. తొమ్మిది రోజుల్లో 52 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా ఖరీఫ్ సీజన్‌లో 90.02 శాతం పంటలు సాగయ్యాయి. సాధారణ సాగు 4.19 లక్షల హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 3,77,379 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి.

17 నుంచి స్వచ్ఛతాహి సేవ



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామాల్లో ' స్వచ్ఛతాహి సేవ – 2024 ' కార్యక్రమాన్ని ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో విడుదల చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బీ నవ్య, జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజు నాయుడు, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బీ నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ పక్షోత్సవ సంబరాల్లో ప్రతి గ్రామంలో ర్యాలీలు, మానవహారాలు, శ్రమదానం, చెత్తకుప్పల తొలగింపు, నీటి వనరుల ప్రాధాన్యాన్ని తెలియజేయడం, ప్రభుత్వ భవనాలు, సంస్మరణీయ స్థలాల సమీపంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. వ్యర్థాలు లేని భారతదేశాన్ని సాధించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని 2017 నుంచి నిర్వహిస్తున్నట్లు డీపీఓ వివరించారు.

సి. బెళగల్‌లో నిలిచిన ఇసుక బుకింగ్



బుకింగ్ కేంద్రం వద్ద వాహనదారులు

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని సచివాలయం – 2లో ఇసుక బుకింగ్ ప్రక్రియ సోమవారం నిలిచిపోయింది. గత నెల 28వ తేదీన ఇక్కడ ఇసుక బుకింగ్ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో మాత్రమే బుకింగ్ ఉండదని చెప్పారు. అయితే వాహనదారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ప్రకటన చేయకుండా సోమవారం ఇసుక బుకింగ్‌ను నిలిపివేశారు. విషయం తెలియని చాలామంది దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంతమంది స్థానిక తహసీల్దార్ కార్యాలయం చేరుకుని అక్కడ తహసీల్దార్ విజయశ్రీను ప్రశ్నించారు.మంగళవారం యథాతథంగా ఇసుక బుకింగ్ ఉంటుందని తహసీల్దార్ తెలిపారు.

ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా పర్సనల్ లోన్లు

- ఉపాధ్యాయులకు 0.50 శాతం వరకు వడ్డీ రాయితీ

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ ఉద్యోగులకు ఎస్‌బీఐ ట్రెజరీ బ్రాంచ్ ద్వారా పెద్ద ఎత్తున పర్సనల్ లోన్‌లు మంజూరు చేయనున్నట్లు చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్ తెలిపారు. పర్సనల్ లోన్ గరిష్టంగా రూ.35 లక్షల వరకు ఇస్తామని ఆయన సోమవారం విలేకరులకు తెలిపారు. ఉద్యోగులకు మరింత ఊరట కలిగించేలా ప్రాసెసింగ్ చార్జీలను పూర్తిగా మినహాయిస్తున్నట్లు తెలిపారు. కాగా సెప్టెంబర్ నెలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులకు అదనంగా వడ్డీ రేటులో 0.50 శాతం వరకు మినహాయింపు ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సదుపాయం ఈ నెల చివరి వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వాన్ని సహించం

కర్నూలు కల్చరల్: అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా హెచ్చరించారు. కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ – పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య వినతులను స్వీకరించారు.



ఆస్పరి మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన కూరగాయలు

ఒకసారి లాభమొస్తే.. పది సార్లు నష్టమొస్తుంది.. అయినా అక్కడి రైతులు కూరగాయల సాగును వదలలేకపోతున్నారు. అందరికీ ఆరోగ్యాన్ని పంచుతూ వారు మాత్రం ఆర్థికంగా కుంగిపోతున్నారు. అప్పుడప్పుడూ పలకరించే మంచి ధర కోసం రెక్కల కష్టాన్ని ఫణంగా పెడుతున్నారు. వీరు పండించిన పంట తెలుగురాష్ట్రాలతోపాటు కర్ణాటకకూ ఎగుమతవుతోంది.

ఆరోగ్యాన్ని పండిస్తున్నారు!

- విస్తృతంగా కూరగాయల సాగు
- ఆస్పరి మండలం నుంచి రోజుకు 150 టన్నుల ఎగుమతి
- ఆస్పరి, బిల్లేకల్లు, బిణిగేరి మార్కెట్లలో విక్రయాలు
- బాగుపడుతున్న గ్రామాలు.. పలువురికి ఉపాధి

ఆస్పరి: కూరగాయల పంటల సాగుకు జిల్లా పశ్చిమ ప్రాంతం ప్రసిద్ధి గాంచింది. బోరుబావులు, వర్షాధారం కింద ఇక్కడి రైతులు వీటిని సాగు చేస్తున్నారు. జిల్లాలో కూరగాయల సాధారణ సాగు విస్తీర్ణం 33,234 హెక్టార్లు ఉండగా.. జిల్లా పశ్చిమ ప్రాంతంలో అత్యధికంగా 20వేల హెక్టార్లలో సాగవుతోంది. చౌళకాయ, టమాటా, చిక్కుడు, వంకాయ, బెండకాయ, కాకరకాయ, బీట్రూట్, పచ్చిమిర్చి, క్యాలీఫ్లవర్, క్యారెట్ తదితర కూరగాయలను పండిస్తున్నారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ. 30వేల వరకు పెట్టుబడి ఖర్చు వస్తోంది. పచ్చి మిర్చి సాగుకు మాత్రం రూ. 50 వేల వరకు వ్యయం అవుతోంది. మార్కెట్‌లో మంచి ధరలు ఉన్నప్పుడు రైతుకు లాభాల పంట పండుతోంది. ఆస్పరి, బిల్లేకల్లు, బిణిగేరి మార్కెట్లు ఉన్నాయి. ఈ మార్కెట్లకు ఆస్పరి, దేవనకొండ, ఆలూరు, ఆదోని మండలాలకు చెందిన రైతులు కూరగాయలను ఆటోల్లో తీసుకొస్తారు. ఇక్కడ 25 మంది వ్యాపారులు వాటిని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. మార్కెట్లలో సవాల్ ద్వారా కూరగాయలను వ్యాపారులు పోటీ పడి కొనుగోలు చేస్తారు.

దిగుబడి ఎంత వస్తుందంటే..

ఆస్పరి, బిల్లేకల్లు, చిగిళి మార్కెట్లకు రోజుకు 150 టన్నుల కూరగాయలు అమ్మకానికి వస్తాయి. ఒక టిప్పరుకు 15 నుంచి 25 కేజీల వరకు ఉన్న ప్యాకెట్లు 600 దాకా లోడు వేస్తారు. 600 ప్యాకెట్లు 10 టన్నుల దాకా ఉంటుందని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఈ మార్కెట్ నుంచి 15 టిప్పర్ల కూరగాయలు ప్రతి రోజూ ఎగుమతి అవుతాయి.

ఎక్కడకు ఎగుమతి చేస్తారంటే..

మార్కెట్లలో వ్యాపారులు తీసుకున్న కూరగాయలను తెలంగాణ రాష్ట్రంలోని పెబ్బేరు, వనపర్తి, అచ్చంపేట, మహబూబ్‌నగర్, పరిగి, షాద్‌నగర్, తాండూరు, వికారాబాద్, జహీరాబాద్, నారాయణఖేడ్, హైదరాబాద్, కామారెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాం, చిక్‌మంగుళూరు, హసన్, బళ్లారి, శిరుగుప్ప, రాయచూర్ పట్టణాలకు టిప్పర్లలో తీసుకెళ్తారు.

250 మంది హమాలీలకు ఉపాధి

ఆస్పరి, చిగిళి, బిల్లేకల్లు మార్కెట్లలో 250 మంది హమాలీలకు ఎనిమిది నెలలు పాటు ఉపాధి లభిస్తుంది. సరుకు కొనుగోలును బట్టి వ్యాపారులు హమాలీలను పెట్టుకుంటారు. ప్రతి వ్యాపారికి 7 నుంచి 15 మంది వరకు పని చేస్తారు. టిప్పర్ల లోడును బట్టి వ్యాపారులు వీరికి వేతనం ఇస్తారు.



నలకదొడ్డి సమీపంలోని పొలంలో చౌళకాయలు కోస్తున్న కూలీలు



ఆస్పరి మార్కెట్లో టమాటాలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

కూరగాయలు పండించే పల్లెలు ఇవే..

ఆస్పరి, బిల్లేకల్లు, అట్టికల్లు, ముత్తుకూరు, వలగొండ, పుటకలమర్రి, కైరుప్పల, చిరుమాన్‌దొడ్డి, శంకరబండ, హలిగేర, చిగిళి, తంగరడోణ, తురువగల్లు, తొగలుగల్లు, యాటకల్లు, జూటూరు, అలారుదిన్నె, పుప్పాలదొడ్డ, అగ్రహారం, కారుమంచి, ఆరికేరి, సుళవాయి, బిలేహాల్, గోనేహాల్, దొడసచెరువు.

మార్కెట్ వేలం పాటల ద్వారా వచ్చిన ఆదాయం గ్రామాల వారీగా..

గ్రామం	సంవత్సరం	ఆదాయం
ఆస్పరి	2021-25	రూ. 1.80 కోట్లు
బిల్లేకల్లు	2021-25	రూ. 1.94 కోట్లు
బిణిగేరి	2022-25	రూ.12.50 లక్షలు

ఆస్పరి మండలంలో కూరగాయల సాగు ఎకరాల్లో..

పంట	విస్తీర్ణం ఎకరాల్లో
చౌళకాయ	207
పచ్చి మిర్చి	815
వంకాయ	124
టమాటా	130
క్యారెట్	70
బెండకాయ	15

మార్కెట్లకు సరకు బాగా వచ్చిన రోజుల్లో ఒక్కొక్క హమాలీకి రూ. 800 వరకు వేతనం పడుతుంది. సగటున రోజుకు రూ.400 వేతనం వస్తుందని హమాలీలు చెబుతున్నారు.

మార్కెట్లతో ఆదాయం

ఆస్పరి, బిణిగేరి, బిల్లేకల్లు దినసరి కూరగాయల మార్కెట్లు ద్వారా గ్రామ పంచాయతీలకు కోట్ల రూపాయాల్లో ఆదాయం వస్తోంది. ప్రతి సంవత్సరం జూలై, ఆగస్టు నెలల్లో మార్కెట్ వేలాలు నిర్వహిస్తారు. ఈసంవత్సరం ఆస్పరి, బిణిగేరి, బిల్లేకల్లు మార్కెట్ వేలాలు జరిగాయి. వేలాల్లో ఎక్కువ మొత్తం పాడిన కాంట్రాక్టర్ ఆ సంవత్సరం హక్కులు దక్కించుకుంటారు. మార్కెట్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్లు రైతుల నుంచి కూరగాయల ప్యాకెట్‌కు రూ.2తోపాటు.. 100 రూపాయలకు 8 రూపాయలు కమీషన్ వసూలు చేస్తారు. ఎనిమిది రూపాయల్లో కాంట్రాక్టర్ నాలుగు రూపాయలను వ్యాపారికి ఇస్తారు.

ఈ ఏడాది ధరలు లేవు



నేను ఐదేళ్ల నుంచి కూరగాయలు సాగు చేస్తున్నా. ఈ సంవత్సరం ఐదు ఎకరాల్లో చౌళకాయ, మరో ఐదు ఎకరాల్లో పచ్చి మిర్చి రూ.3.50 లక్షలు పెట్టుబడితో బోరు కింద సాగు చేశా. ఈ ఏడాది కూరగాయలకు ధర లేదు. మార్కెట్లో ధర ఉండి పంట దిగుబడి బాగా వస్తే గిట్టుబాటు అవుతుంది. ధర లేకపోతే కూలీలకు కూడా చేతి నుంచి డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి సారి ఇలాగే ఉండదు. ఒక్కోసారి లాభాలు కూడా వస్తాయి.

– నాగేంద్ర, హలిగేర గ్రామం, ఆస్పరి మండలం

ఉపాధి దొరుకుతోంది



బిల్లేకల్లు కూరగాయల మార్కెట్ ద్వారా 8 నెలలు ఉపాధి దొరుకుతోంది. పొలాల్లో నుంచి కూరగాయలు ప్యాకెట్లు వేసుకొస్తే దూరాన్ని బట్టి రూ. 300 నుంచి రూ. 500 తీసుకుంటా. రోజుకు మూడు ట్రిప్పులు తీసుకొస్తా. ఖర్చుల పోను రోజుకు రూ. 600 మిగులుతుంది. కూరగాయల మార్కెట్ మా గ్రామంలో 10 మంది ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పిస్తోంది.

– సుంకన్న, ఆటో డ్రైవర్

డిమాండ్‌ను బట్టి కొనుగోలు చేస్తాం



మార్కెట్లో ఏడుగురు వ్యాపారులు ఉన్నారు. సరుకు తక్కువగా ఉన్నప్పుడు వ్యాపారుల మధ్య పోటీ ఎక్కువగా ఉంటుంది. డిమాండ్‌ను బట్టి మేం కూరగాయలను కొనుగోలు చేస్తాం. మార్కెట్ ద్వారా 150 మంది హమాలీలకు పని దొరుకుతోంది.

– మహేష్, వ్యాపారి, బిల్లేకల్లు, ఆస్పరి మండలం

గ్రామాభివృద్ధికి ఉపయోగిస్తాం



దినసరి కూరగాయాల మార్కెట్ వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి ఉపయోగిస్తాం. గ్రామంలో మూడు సంవత్సరాల నుంచి కోటి రూపాయలతో సీసీరోడ్లు, రూ. 50 లక్షలతో డ్రైనేజీ కాలువలు నిర్మించాం. మా గ్రామానికి మార్కెటే ఆదాయ వనరు.

– శ్రీను, బిల్లేకల్లు సర్పంచ్, ఆస్పరి మండలం

పల్లెల్లో అంతర్గత రహదారులకు ప్రతిపాదనలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించేందుకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నారు. నిబంధనల మేరకు ఒక్కో మండలానికి రూ.2 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు వీలుగా అంచనాలు రూపొందించారు. ఇప్పటి వరకు జిల్లాలోని కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గాలు మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలకు చెందిన మండలాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను కలెక్టర్‌కు నివేదించేందుకు పీఆర్ ఇంజినీర్లు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక్కో మండలానికి రూ.2 కోట్ల ప్రకారం జిల్లాలోని 25 మండలాల్లోని గ్రామాల్లో రూ.50 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభం కానున్నాయి.

రబీ సీజన్‌కు 78,947 క్వింటాళ్ల విత్తనం

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్‌కు సబ్సిడీపై పంపిణీ చేసేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాకు 78,947 క్వింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో శనగ (బెంగాల్ గ్రామ్) విత్తనాలు72,114 క్వింటాళ్లు, వేరుశనగ 5,780 క్వింటాళ్లు, మినుము 1,050 క్వింటాళ్ల అలాట్‌మెంట్ ఇచ్చింది. కర్నూలు జిల్లాకు జేజీ-11 రకం శనగ 45,953 క్వింటాళ్లు, కే-6 రకం వేరుశనగ 4,830 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు శనగ విత్తనాలు 26,161 క్వింటాళ్లు, వేరుశనగ 950 క్వింటాళ్లు, మినుము 1,050 క్వింటాళ్లు కేటాయిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 2.20 లక్షల హెక్టార్లలో శనగ సాగవుతోంది. అయితే సబ్సిడీపై పంపిణీకి అరకొరగానే అలాట్‌మెంట్ ఇచ్చినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విత్తనాలను ఉమ్మడి జిల్లాకు ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీసీడ్స్) సరఫరా చేస్తోంది. ప్రస్తుతం ఏపీ సీడ్స్‌లో 10వేల క్వింటాళ్ల విత్తనం అందుబాటులో ఉండటం గమనార్హం.

ఇన్‌పుట్ సబ్సిడీకి 12న ప్రతిపాదనలు

ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఈ నెల 12న జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి తెలిపారు. జిల్లాలో అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలపై వెంటనే ఎన్యూమరేషన్ పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారులకు సోమవారం ఆమె ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలోని 11 మండలాల్లోని 72 గ్రామాల్లో అధిక వర్షాల ప్రభావం ఉందన్నారు. ఆగస్టు నుంచి కురిసిన వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాలవారీగా నష్టపోయిన రైతుల జాబితాలను 10, 11 తేదీల్లో ప్రదర్శించి, అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. వాటిని పరిష్కరించి 11వ తేదీ జాబితాలను తమకు పంపాలన్నారు.

పశుసంవర్ధక శాఖలో పదోన్నతులు

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారులకు డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతులు లభించాయి.

- కోవెలకుంట్ల వెటర్నరీ ఏరియా హాస్పిటల్ ఏడీగా పనిచేస్తున్న వీరబ్రహ్మంకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి జమ్మలమడుగు డివిజినల్ డీడీగా నియమించారు.
- దెందులూరు ఏడీ కె.శ్రీనివాసరావును పదోన్నతిపై నంద్యాల డివిజన్ డీడీగా నియమించారు.
- నంద్యాల డీడీ రమణమూర్తిని అక్కడే డిప్యూటేషన్‌పై ఘనీకృత వీర్యకేంద్రం డీడీగా నియమించారు.
- ఆదోని డివిజినల్ డీడీ రమణ బనవాసి ఘనీకృత వీర్య కేంద్రం డీడీగా డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. ఈ స్థానంలో చిత్తూరు జిల్లాలో వీపీసీ ఏడీగా పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డిని పదోన్నతిపై డీడీగా నియమించారు.
- నంద్యాల ఘనీకృత వీర్యకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఓ. నరసింహారావుకు జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు.



ఎమ్మిగనూరులోని తుంగభద్ర దిగువ కాలువలో గణేశ్ నిమజ్జనం చేస్తున్న దృశ్యం

భక్తా.. వెళ్లొస్తా

జిల్లాలో సోమవారం గ్రామీణ ప్రాంతాల్లో వినాయక నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొన్ని పట్టణాల్లోనూ గణనాథులకు భక్తులు వీడ్కోలు పలికారు. ఆయా ప్రాంతాల్లో గణేశ్ శోభాయాత్రలు కనుల పండువగా సాగాయి. నిమజ్జనోత్సవంలో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మొబైల్ హ్యాక్ చేసి రూ.5 లక్షలు స్వాహా

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

కర్నూలు: మొబైల్ ఫోన్‌ను హ్యాక్ చేసి బ్యాంక్ యాప్ ద్వారా బ్యాంకు ఖాతాలోని రూ.5 లక్షలు సైబర్ నేరగాళ్లు స్వాహా చేశారని, విచారణ జరిపి న్యాయం చేయాల్సిందిగా ఎమ్మిగనూరు మండలం కోటేకల్ గ్రామానికి చెందిన ఇబ్రహీం సోమవారం ఎస్పీ బిందు మాధవ్‌కు ఫిర్యాదు చేశారు. ఈయన ఎమ్మిగనూరు బ్రాంచ్ యూనియన్ బ్యాంకులో బిజినెస్ కరస్పాండెంట్‌గా పనిచేస్తున్నారు. మే 17వ తేదీన తన ఫోన్ హ్యాక్ చేసి సైబర్ నేరగాళ్లు మొబైల్ బ్యాంక్ యాప్ ద్వారా రూ.5 లక్షలు డబ్బులు కాజేసినట్లు ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 91 ఫిర్యాదులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చాయి. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి, న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానని ఎస్పీ హామీ ఇచ్చారు. లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సీఐ గుణశేఖర్ బాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

ఫిర్యాదుల్లో కొన్ని...

- కర్నూలు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో తన కుమారుడు, కుమార్తెకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన అయేషా బేగం, జహీర్ రూ.5.75 లక్షలు తీసుకుని మోసం చేశారని కర్నూలు వివేక్ నగర్‌కు చెందిన ఉదయ్ కుమార్ ఫిర్యాదు చేశారు.
- రూ.25 వేలు ఇస్తే రూ.8 లక్షలు స్పాట్ లోన్ ఇప్పిస్తానని చెప్పి ప్యాలకుర్తికి చెందిన రాజు ఫోన్‌పే ద్వారా డబ్బులు వేయించుకుని మోసం చేశాడని, చర్యలు తీసుకోవాలని దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన సంజన్న కోరారు.
- ఆస్తి కోసం కుమారుడు కాశెన్న, కోడలు సుగుణమ్మ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, న్యాయం చేయాలని ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట గ్రామానికి చెందిన సుంకమ్మ కోరారు.
- పొలంలోకి రానివ్వకుండా పక్క పొలం వారు మహదేవమ్మ, వన్నూరప్ప దౌర్జన్యం చేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని హొళగుంద మండలం కోగిలతోట గ్రామానికి చెందిన మారెమ్మ ఫిర్యాదు చేశారు.
- ఐదు ఎకరాల పొలంలో ఎకరా 16 సెంట్ల భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేసుకోవడమే కాకుండా సుధాకర్ అనే వ్యక్తి తనను కొట్టి గాయపరిచాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని వెల్దుర్తి మండలం బింగిదొడ్డి గ్రామానికి చెందిన వెంకటరాముడు కోరారు.
- తన బాగోగులు పట్టించుకోకుండా కుమారుడు, కోడలు ఇంటి నుంచి గెంటివేయడంతో కుమార్తె దగ్గర ఉంటున్నానని, సంఘటనపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాల్సిందిగా కర్నూలు మజుందార్ నగర్‌కు చెందిన సుశీల విన్నవించారు.

నిప్పులు కక్కిన మబ్బులు!



పచ్చని చేలలో మొలచినట్లుగా కనిపించే నివాస గృహాలు.. వాటి మధ్య ఎర్రటి రోడ్డు.. చీకటి పడుతున్న వేళ మోటారు సైకిళ్లపై లైట్లతో ఇళ్లకు చేరుతున్న ప్రజలు.. నింగిలో నిప్పులు కక్కుతున్నట్లు మబ్బులు.. ఈ దృశ్యం సోమవారం కర్నూలు నగర శివారులో ఆవిష్కృతమైంది. ఇటీవల చోటుచేసుకున్న వాతావరణ మార్పులతో తెరపివ్వకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఆకాశం నిత్యం మేఘావృతమై కనిపిస్తోంది. సోమవారం సాయం సంధ్య వేళ సూర్యుడు అస్తమించగా ఆ వెలుగులు తాకిన మబ్బులు నిప్పుల్ని కక్కుతున్నట్లు కనిపించాయి.

–సాక్షిఫొటో గ్రాఫర్, కర్నూలు


కర్నూలు కేసీ కెనాల్‌లో నిమజ్జన దృశ్యం


హొళగుంద వద్ద ఎల్లెల్సీలో..


పెద్దకడబూరు మండలం బాపులదొడ్డిలో రూ. 32వేల ధరతో వినాయకుడి లడ్డూ దక్కించుకున్న కుటుంబం

బైబై గణేశా!

మూడు రోజుల పాటు భక్తుల నుంచి పూజలు అందుకున్న గణనాథుడు సోమవారం గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆయా గ్రామాల సమీపంలోని చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డప్పులు, మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య యువకులు చిందులు వేస్తూ ఉత్సాహంగా కనిపించారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్


కర్నూలులో నిమజ్జనానికి వినాయకుడిని తీసుకొస్తున్న మహిళలు







1.కోవెలకుంట్ల కుందూనదిలో విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు 2.జూపాడుబంగ్లా మండలం కేసీ కాల్వలో నిమజ్జనం


భక్తజనం మధ్య హొళగుందలో గణేశ్ విగ్రహాల ఊరేగింపు


గడివేముల మండలం బిలకలగూడూరులో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు


కర్నూలులో నిమజ్జనోత్సవ ఉత్సాహం


మద్దికెర మండలం పెరవలిలో ఉట్టి కొడుతున్న యువకులు


దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


హొళగుందలో కలశాలతో చిన్నారులు

ముస్లింల సోదరభావం అభినందనీయం


మజ్జిగను పోస్తున్న సీఐ అశోక్ కుమార్, నాయకులు

కౌతాళం: ముస్లింల సోదరభావం అభినందనీయం అని కౌతాళం సీఐ అశోక్‌కుమార్, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మారుతీ మోహన్, ఎంపీడీఓ సుబ్బారాజు, డిప్యూటీ తహసీల్దారు వీరేంద్రగౌడ్ అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో సోమవారం జరిగిన గణేశ్ నిమజ్జన కార్యక్రమంలో మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నీళ్ల ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ అందరూ కలసి మెలసి చేస్తేనే పండుగ అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాల్‌దినకర్, కమిటీ పెద్ద ప్రహ్లాదచారి, వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, గణేశ్ కమిటీ సభ్యులు రాఘవేంద్రరెడ్డి, సుబ్బరాజు, చౌదరి బసవ, ఉప సర్పంచ్ సత్రి తిక్కయ్య, పెద్దలు దూద్‌బాషా, వలీసాబ్, మహబుబ్, ఇసాక్, షేక్షావలీ, గౌస్‌పీర్, జిన్నవలి, మౌలనా అక్బర్ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో అరుదైన గుండెశస్త్రచికిత్స


అతావుర్ రెహమాన్‌తో డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): పలు ఆరోగ్య సమస్యలు ఉన్న వ్యక్తికి గుండె శస్త్రచికిత్స చేసి ప్రాణం పోశారు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్యులు. ఆసుపత్రి సూపరింటెండెంట్, కార్డియోథొరాసిక్ హెచ్‌వోడి డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నందికొట్కూరుకు చెందిన అతావుర్ రెహమాన్(66) వ్యవసాయ కూలీ. అతనికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. అతనికి ఇటీవల ఛాతీలో నొప్పి రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. యాంజియోగ్రామ్ చేయడంతో అన్ని రక్తనాళాలు బ్లాక్ కావడంతో పాటు గుండెపనితీరు 25 శాతం మాత్రమే ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. బైపాస్‌సర్జరీ చేయాలంటే ఊపిరితిత్తుల్లో సీవోపీడీ సమస్య ఉంది. దీని కారణంగా గుండె పెద్దగా మారింది. ప్రైవేటులో అతనికి వైద్యం నిరాకరించడంతో ఇక్కడికి వచ్చారని, తాము కూడా కాదంటే వారి కుటుంబం రోడ్డున పడుతుందని గ్రహించి.. వారం క్రితం గుండె శస్త్రచికిత్స చేసినట్లు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వారం రోజుల తర్వాత అతను పూర్తి కోలుకున్నాడని చెప్పారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి


జయశ్రీ (ఫైల్)

గోనెగండ్ల: మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామంలో సోమవారం ట్రాక్టర్ ఢీకొని బోయ జయశ్రీ(29) అనే మహిళ మృతి చెందింది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు.. ఐరన్‌బండ గ్రామానికి చెందిన బోయ జయశ్రీ సోమవారం ఉదయం గొల్ల పద్మావతి అనే మహిళతో కలిసి పొలంలో కూలీ పనులు చేసేందుకు వెళ్తుండగా ట్రాక్టర్ వచ్చి ఢీకొట్టింది. దీంతో జయశ్రీకి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి భర్త రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ ముల్ల బాబుబాషాపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ తొలగింపునకు టీడీపీ కుట్ర

తుగ్గలి: ఉప్పర్లపల్లి ఫీల్డ్‌అసిస్టెంట్ రాజునాయక్‌ను తప్పించాలని అధికారులపై టీడీపీ నేతలు ఒత్తిడి తెస్తున్నారు. అధికారులు చర్యలకు ఉపక్రమించడంతో కూలీలు అడ్డుకున్నారు. దివ్యాంగుడైన ఫీల్డ్‌అసిస్టెంట్ రాజునాయక్ ఇప్పటి వరకు 12 సార్లు ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్ అవార్డు అందుకుని అధికారుల మన్ననలు పొందారు. కరోనా విపత్కర సమయంలో సైతం కూలీలకు పనులు కల్పించారు. అలాంటి ఎఫ్ఏను తప్పించాలని టీడీపీ నేతలు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ఏ తప్పు చేయని తనను తప్పించేందుకు అక్రమాలకు పాల్పడ్డానని ఉపాధి అధికారులకు ఫిర్యాదు చేశారని ఫీల్డ్ అసిస్టెంట్ తెలిపారు. విచారణ పేరుతో సోమవారం ఏపీడీ ఫక్కీరప్ప గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవినీతికి పాల్పడకున్నా ఎలా తొలగిస్తారంటూ కూలీలు.. ఫీల్డ్ అసిస్టెంట్‌కు మద్దతుగా నిలిచారు. ఈ విషయమై ఏపీడీని సంప్రదించగా అక్రమాలకు పాల్పడ్డాడని ఫీల్డ్‌అసిస్టెంట్‌పై ఫిర్యాదు రాలేదని, ఉప్పర్లపల్లి పంచాయతీలో ఉన్న తండాలు ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పడ్డాయని, దీంతో ఉప్పర్లపల్లికి ప్రత్యేక ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరినట్లు చెప్పారు.

ఆకతాయికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయికి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి సోమవారం జైలు శిక్ష విధించినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. విశ్వనగర్‌కు చెందిన భూపని దుర్గబోయిన ప్రసాద్.. విశ్వనగర్ ఆర్చి వద్ద దారిన పోయే మహిళలకు సైగలు చేస్తూ ఈలలు, కేకలు వేస్తూ అసభ్యకర పదజాలంతో దూషించేవాడు. బాధిత మహిళలు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి ఏడు రోజులు జైలు శిక్షను విధిస్తూ తీర్పు వెలువరించినట్లు పోలీసులు తెలిపారు.

గణేశ్ ఉత్సవాల్లో అపశ్రుతి

- వివిధ ప్రాంతాల్లో ఇద్దరు మృతి.. ఒకరు గల్లంతు



గల్లంతైన బాలుడు లాల్‌బాషా, మృతిచెందిన అశోక్

ఆళ్లగడ్డ/వెల్దుర్తి: గణేశ్ ఉత్సవాల్లో మూడోరోజు సోమవారం అపశ్రుతులు చోటు చేసుకున్నాయి. అహోబిలంలో నిమజ్జనం చేస్తుండగా ఓ బాలుడు గల్లంతయ్యాడు. ఆళ్లగడ్డలో వినాయక విగ్రహం మండపం వద్ద డ్యాన్స్ వేస్తూ యువకుడు మృతి చెందాడు. వెల్దుర్తి మండలం సూదేపల్లె గ్రామంలో నిమజ్జనోత్సవం సందర్భంగా నీటిలో మునిగి వృద్ధుడు మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. అహోబిలం గ్రామంలోని తెలుగుగంగ ప్రధాన కాలువలో విగ్రహాలను నిమజ్జనం చేస్తుండగా నలుగురు అందులో పడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. ముగ్గురు యువకులు కొంత దూరం వెళ్లి ఒడ్డుకు చేరుకోగా లాల్‌బాషా (12) గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ, పోలీస్, రెవెన్యూ అధికారులు రాత్రి పొద్దుపోయేవరకు తెలుగుగంగ కాల్వ వెంట గాలింపు చేపట్టినా బాలుడి ఆచూకీ లభ్యం కాలేదు. బాలుడి తండ్రి లాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

డ్యాన్స్ వేస్తూ..

ఆళ్లగడ్డ గంగమ్మ వీధిలోని గణేశ్ మండపం వద్ద డ్యాన్స్ వేస్తూ అశోక్ (25) అనే యువకుడు మృతి చెందాడు. ఆశ్రమ వీధికి చెందిన అశోక్ ఆదివారం రాత్రి మండపం సమీపంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో పాల్గొని రాత్రి పొద్దుపోయేవరకు డ్యాన్స్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న కొందరు గమనించి అశోక్‌ను స్థానిక వైద్యశాలకు తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చెరువులో మునిగి..


మృతుడు మాల మాదన్న

వెల్దుర్తి మండలం సూదేపల్లె గ్రామంలో నీటిలో మునిగి వృద్ధుడు మృతిచెందాడు. సోమవారం నిమజ్జనం సందర్భంగా గ్రామస్తులు విగ్రహాలను సమీప చెరువుకు తరలించారు. గ్రామానికి చెందిన మాల మాదన్న(74) చెరువులోకి దిగాడు. అనంతరం అందరూ ఇంటికి చేరుకోగా మాదన్న రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించారు. చివరికి చెరువులో మాదన్న మృతదేహం తేలి కనిపించింది. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. మాదన్న మృతి పట్ల గ్రామపెద్దలు సంతాపం వ్యక్తం చేశారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

క్లుప్తంగా

వరద బాధితులకు మాజీ సైనికుల వితరణ

కర్నూలు(అర్బన్): విజయవాడ నగరంతో పాటు చుట్టుపక్క గ్రామాల్లోని వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లాలోని మాజీ సైనికుల నుంచి విరాళాలు సేకరిస్తున్నట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నర్రా పేరయ్య తెలిపారు. మాజీ సైనికులు ఇంటిగ్రేటెడ్ ట్రీ సర్వీస్ ఈఎస్ఎంకు రూ.500 నుంచి రూ.4 వేల వరకు ఫోన్‌పే చేయాలని కోరామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫోన్‌పే చేసిన మొత్తాలకు సంబంధించిన స్క్రీన్ షాట్‌లను తమకు పంపుతున్నారని తెలిపారు. ప్రతి మాజీ సైనికుడు ఈ కార్యక్రమంలో పాల్గొని తమకు తోచిన రీతిలో ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య


హనుమన్న(ఫైల్)

తుగ్గలి: అప్పుల బాధతో మండల పరిధిలోని జొన్నగిరి గుంత అనుమన్న (59) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నారు. గుత్తి రైల్వే పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గుంత అనుమన్న ఉన్న నాలుగున్నర ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సేద్యం గిట్టుబాటు కాక, మరో వైపు కుటుంబ పోషణ, పిల్లల పెళ్లిళ్లు చేసి అప్పులపాలయ్యారు. రూ. లక్షల్లో ఉన్న అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయి గుత్తి మండలం జక్కలచెర్వు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడికి భార్య జమునమ్మ, ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు.

వీరశైవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కర్నూలు(హాస్పిటల్): వీరశైవ ప్రతిభా పురస్కారాలకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వీరశైవ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖరప్ప సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 2024 సంవత్సరంలో ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో 90 శాతానికి పైగా మార్కులు పొందిన విద్యార్థులు మాత్రమే పురస్కారాలకు అర్హులన్నారు. అలాగే ఇదే సంవత్సరంలో ఎన్ఐటి, ఎన్ఈఈటి, ఐఐటి, ఐఐఐటి, ఈఏపీసీఈటీలో సీటు సంపాదించిన విద్యార్థులు, మెడికల్ సీటు పొందిన విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వీరితో పాటు 2023 సంవత్సరంలో అక్టోబర్ నుంచి ఈ యేడాది సెప్టెంబర్ వరకు పదవీ విరమణ పొందిన వీరశైవ ప్రభుత్వ ఉద్యోగులను సన్మానిస్తామన్నారు. పురస్కారాల కార్యక్రమం నిర్వహణ తేదీ త్వరలో వెల్లడిస్తామన్నారు. వివరాలకు 98857 92122 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

భవనం పైనుంచి పడి మృతి


మృతి చెందిన రవి

నందవరం: భవనం పైనుంచి పడి భవన నిర్మాణ కార్మికుడు ఎస్. రవి(35) సోమవారం మృతి చెందాడు. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు మేరకు.. నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన భవన నిర్మాన కార్మికుడు రవి రోజు వారి కూలి పని నిమిత్తం మంత్రాలయం వెళ్లాడు. సోమవారం భవనంలో మూడో అంతస్తులో పనిచేస్తూ పైనుంచి కింద పడ్డాడు. వెంటనే పక్కన ఉన్న కార్మికులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతి చెందిన రవికి భార్య రత్నమ్మ, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- రూ. 9 లక్షల నగదు, రెండు వాహనాలు స్వాధీనం
- గురు రాఘవేంద్ర పంప్‌సెట్లను ధ్వంసం కేసును ఛేదించిన పోలీసులు


దొంగల అరెస్ట్ చూపుతున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసాచారి, పోలీసులు



దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న రూ. 9 లక్షల నగదు, కాపర్ కడ్డీలు

ఎమ్మిగనూరురూరల్: శ్రీ గురురాఘవేంద్ర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో పంప్ సెట్లను ధ్వంసం చేసి అందులోని ఆయిల్, రాగి వైర్లు, రాగి ప్లేట్లను దొంగలించిన కేసును పోలీసులు ఛేదించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా, మరో నలుగురు పరారీలో ఉన్నారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసాచారి నిందితులను, పట్టుబడిన నగదు, కాపర్ కడ్డీలను, వాహనాలను సోమవారం విలేకరులకు చూపించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంత్రాలయంలో మూడు, నందవరంలో మూడు, కోసిగిలో ఒకటి , డోన్‌లో ఒకటి, వైఎస్సార్ జిల్లా కమలాపురంలో ఒక కేసు నమోదు అయినట్లు చెప్పారు. దొంగలను పట్టుకునేందుకు ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేక బృందాన్ని నియమించారన్నారు. మహారాష్ట్రకు చెందిన ఏడుగురు దొంగల ముఠా పనే అని సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించినట్లు తెలిపారు. వీరు మళ్లీ చోరీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ వైపు వస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో సీఐ విక్రమసింహ, నందవరం ఎస్ఐ శ్రీనివాసులు, మంత్రాలయం సీఐ రామాంజులు, మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్‌ను అప్రమత్తం చేశామన్నారు. నిందితుల సెల్ ఫోన్ సిగ్నల్స్, లోకేషన్ ఆధారంగా నందవరం మండలం నాగలదిన్నె బ్రిడ్జిపై ఐచర్ మినీ లారీ, జైలో వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా ముగ్గురు నిందితులు పట్టుబడినట్లు తెలిపారు. మహారాష్ట్ర బీడ్ జిల్లా మజల్గావ్ పట్రూడ్ తాలూకా సిందువాడి గ్రామానికి చెందిన కరణ్ సరపదే(19), మహారాష్ట్రలో షర్బానీ టౌన్ ఖాదారాబాద్ ప్లాట్‌కు చెందిన కరీముద్దీన్(47), షర్బానీ టౌన్ ధార్ రోడ్డులోని పులహరి బిల్డింగ్ దగ్గర నివాసముండే షేక్ జహీర్(48)ను అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి ఆయిల్, కాపర్ కడ్డీలు, దొంగలించిన సొమ్ము విక్రయించగా వచ్చిన రూ. 9 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ముఠాలో మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. రాయలసీమలోని మరి కొన్ని చోట్ల ఈ ముఠా దొంగతనాలు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. తొమ్మిది కేసుల్లోని నిందితులను అరెస్ట్ చేసిన డీఎస్పీ శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో బృందం సభ్యులు జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, కర్నూలు సెంట్రల్ క్రైం స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శేషయ్య, కర్నూలు సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులను ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.